క్లుప్తంగా

కురుమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీలో కురుమ సంఘం అధ్యక్షుడు మల్లేశ్ తదితరులు

నర్సాపూర్: కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నర్సాపూర్‌లో ర్యాలీ చేపట్టారు. జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు మల్లేశ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, సంగారెడ్డిలో జరిగిన దొడ్డి కొమరయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యాక్రమానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో మల్లేశ్‌తో పాటు కురుమ యువజన సంఘం మండల అధ్యక్షుడు రాంచంద్రాపూర్, సర్పంచ్ శ్రీశైలం, పలు మండల శాఖల అధ్యక్షులు నవీన్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన



మక్కరాజీపేటలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో పారిశుధ్య కార్మికులు ఆదివారం భిక్షాటన చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న తమకు మూడు నెలలుగా వేతనాలు అందించడం లేదని వాపోయారు. అధికారులకు తెలియజేసినా.. పట్టించుకోక పోవడంతో భిక్షాటనతో నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మాసయ్య, సాదు, సత్తయ్య, నాగరాజు, కుమార్, సిద్దవ్వ, నల్లపోచయ్య, మహేందర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



కూచారం గ్రంథాలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్‌యూత్ వారంవారం స్వచ్ఛభారత్ చేపడుతున్నారు. ఆదివారం 254వ వారం స్వచ్ఛభారత్ చేపట్టి గ్రంథాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల వద్ద ప్లాస్టిక్, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం మొక్కల పాదులను శుభ్రం చేసి, నీటిని పోశారు. చిన్నారులు సైతం స్వచ్ఛభారత్‌లో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



కండువా కప్పుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల బీజేవైఎం అధ్యక్షుడు జంగంరాజు ఆదివారం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ, రాజు మెడలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నార్సింగి మండల జెడ్పీటీసీ కృష్ణరెడ్డి, పాల్గొన్నారు.

రాయ్‌పూర్ ప్లీనరీలో కాంగ్రెస్ నేతలు



సమావేశంలో మ్యాడం బాలకృష్ణ

మెదక్‌జోన్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్ జరిగిన కాంగ్రెస్ సమావేశాలకు మెదక్ నుంచి పీసీసీ నేత మ్యాడం బాలకృష్ణ, తదితరులు హాజరయ్యారు.

దుస్తుల అందజేత

పెద్దశంకరంపేట(మెదక్): మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మురళీపంతులు తనయుడు వంశీ వివాహం సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆయన ఆదివారం దుస్తులను అందజేశారు.

అధ్వానంగా రేషన్ బియ్యం

- పురుగులు పట్టిన, నూకలు, తవుడు బియ్యమే దిక్కు
- పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం
- పాఠశాలలకు కూడా జాలిపట్టిన పురుగుల బియ్యమే..



అల్లాదుర్గం పాఠశాలకు సరఫరా చేసిన పురుగుల బియ్యం



అల్లాదుర్గంలో రేషన్ బియ్యంలో వచ్చిన తవుడు

అల్లాదుర్గం(మెదక్): రేషన్ బియ్యం పంపిణీ అధ్వానంగా మారింది. స్థానికంగా పండించిన బియ్యమే రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. అవి వట్టి మాటలే అని అర్థమవుతోంది. ఆరు నెలలుగా రేషన్ షాపులకు అధ్వానమైన బియ్యం సరఫరా చేస్తున్నారు. ఒక నెల జాలి పట్టిన పురుగుల బియ్యం, మరోసారి నూకలు, తవుడు బియ్యం అందజేస్తున్నారు. ప్రజలు, డీలర్లు ఆందోళన చేస్తున్న కనీసం అధికారులు విచారణ చేసి, చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పౌరసరఫరా గోదాంలో, బియ్యం సరఫరా చేసే కాంట్రాక్టర్ల అక్రమాలతోనే నాణ్యమైన రేషన్ బియ్యం అందడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలకు నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్ పురుగుల బియ్యం, దొడ్డు బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

- అల్లాదుర్గం మండలానికి పెద్దశంకరంపేట పౌరసరఫరా గోదాం నుంచి రేషన్ షాపులు, ప్రభుత్వ పాఠశాలలకు బియ్యం సరఫరా చేస్తారు. ఫిబ్రవరి నెల రేషన్ బియ్యంలో తవుడు, నూకలు అధికంగా ఉన్న బియ్యం అందజేశారు. 20 కి లోల రేషన్ బియ్యంలో 3 నుంచి 5 కిలోల తౌడు వచ్చిందని వినియోగదారులు చెబుతున్నారు.
- చిల్వెర, నడిమితండా, గాండ్లబాయ్ తండా పాఠశాలలకు పురుగులు, జాలి పట్టిన బియ్యం సరఫరా చేశారు. ఈ సంఘటనపై ఎంఈఓ గోదాం ఇన్‌చార్జ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.
- బహిరన్‌దిబ్బ ప్రాథమికోన్నత పాఠశాల మధ్యాహ్న భోజనం అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం బంద్ చేశారు. కానీ ఎలాంటి విచారణ లేదు.
- ఆరు నెలలుగా రేషన్ షాపులకు అధ్వానమైన బియ్యం సరఫరా చేస్తున్నారు. మండల పరిధిలోని ముస్లాపూర్, కాయిదంపల్లి, గడిపెద్దాపూర్ గ్రామాలకు గతంలో అధ్వానమైన బియ్యం సరఫరా చేస్తే తిరిగి పంపించారు. ఇంత జరుగుతున్నా.. పౌరసరఫరా శాఖ అధికారులు మాత్రం పెద్దశంకరంపేట గోదాంను తనిఖీ ఎందుకు చేయడం లేదని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.
- రైసు మిల్లులకు చేరుతున్న రేషన్ బియ్యం అధ్వానమైన రేషన్ బియ్యం సరఫరా చేయడంతో చాలా మంది వినియోగదారులు వాటిని బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. పురుగులు పట్టిన, నాణ్యత లేని బియ్యం తిన లేకపోతున్నారు. అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాల్లో బియ్యం కొనుగోలు చేసి, పెద్దశంకరంపేటలోని ఓ రైస్ మిల్లులో అమ్ముతున్నట్లు తెలిసింది. ఇదే బియ్యం మళ్లీ రేషన్ షాపులకు సరఫరా అవుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రతీ నెల రైస్‌మిల్లు యాజమానులు కొంత మందిని ఏర్పాటు చేసుకొని రేషన్ బియ్యం కొనుగోలు చేయిస్తున్నారు.

ఐదు కిలోల తవుడు ఉంది



రేషన్ షాపులో ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం అధ్వానంగా ఉంటున్నాయి. ఈ నెలలో పంపిణీ చేసిన బియ్యంలో 20 కిలోల బియ్యానికి ఐదు కిలోల తవుడు ఉంది.

– పాపయ్య, అల్లాదుర్గం

ముక్కిన బియ్యం వస్తున్నాయి



రేషన్ షాపుల్లో సరఫరా చేస్తున్న బియ్యం ప్రతీ నెల అధ్వానంగా ఉన్నాయి. డీలర్లను ప్రశ్నిస్తే గోదాంలో ఉన్నవే అందిస్తున్నామని చెబుతున్నారు. కొంత కాలంగా ముక్కిన, జాలి కట్టిన బియ్యం ఇస్తున్నారు.

– శ్రీకాంత్, అల్లాదుర్గం

మరి కొందరు నూకలు కొనుగోలు చేస్తూ మిల్లులకు అమ్ముతున్నారు. రేషన్ బియ్యంలో నూకలు, తవుడు కలుపుతూ నాణ్యత లేని బియ్యం పేదలకు అందజేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పందించి.. ఈ అక్రమ దందాకు చెక్ పెట్టి పేదలకు నాణ్యమైన రేషన్ బియ్యం అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు పాయె.. కర్రలు మిగిలె..



నర్సాపూర్ - తూప్రాన్ రోడ్డు పక్కన నాటిన మొక్కలు

నర్సాపూర్: రోడ్డు పక్కన నాటిన మొక్కలు ఆలన పాలన లేక కర్రలుగా మిగిలాయి. వాటికి (రక్షణగా) ఊతంగా పెట్టిన కట్టెలు కిందపడిపోయాయి. నర్సాపూర్ నుంచి తూప్రాన్ రోడ్డుకు ఒక పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో కంపా పథకం కింద గత ఏడాది అటవి శాఖ అధికారులు మొక్కలు నాటి, వాటికి సపోర్టుగా కట్టెలు పెట్టారు. అనంతరం వాటిని ఎవరూ పట్టించుకోలేదు. అటవీ శాఖ అధికారులు నాటిన మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో అసలైన మొక్కలు సరిగా కన్పించడం లేదు. ప్రభుత్వ నిధులు ఖర్చు చేసి, నాటిన మొక్కలు కర్రలుగా మారడం గమనార్హం. కాగా నాటిన మొక్కలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై అటవీ శాఖ నర్సాపూర్ సెక్షన్ అధికారి బాలేశ్‌ను వివరణ కోరగా.. అటవీ శాఖ ఆధ్వర్యంలో కంపా పథకం కింద అడవిలో, ఖాళీ ప్రాంతాల్లో నాటే మొక్కలకు నీరు పెట్టేందుకు ప్రత్యేకంగా నిధులు ఉండవని చెప్పారు. అంతేగాక ట్రీ గార్డులు సైతం పెట్టేందుకు వీలు లేదని చెప్పారు. కాగా ప్రస్తుతం ఆకు రాలే సీజన్ కావడంతో మొక్కల ఆకులు రాలి అవి అలా కన్పిస్తున్నాయని వచ్చే వర్షాకాలంలో వర్షాలు పడగానే మొక్కలు తిరిగి పుంజుకొని ఏపుగా పెరుగుతాయని ఆయన చెప్పారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనులను ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పరిశీలించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే సొంత నిధులతో నూతన ఆలయం నిర్మిస్తున్నారు. దీంతో పనులను పర్యవేక్షించారు. ఆలయ నిర్మాణం దాదాపుగా పూర్తి అయింది. ప్రస్తుతం గ్రానైట్ వేయడం, పేయింటింగ్ పనులు జరుగుతున్నాయి. దీంతోపాటు పోచమ్మదేవి, ఎల్లమ్మ దేవి ఆలయం నిర్మాణ పనులు సైతం జరుగుతున్నాయి. మార్చి 8, 9, 10వ తేదీల్లో విగ్రహ ప్రతిష్ఠ చేయనుండగా పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పైడి శ్రీధర్‌గుప్తా, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, దర్జి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సికింద్లాపూర్ జాతర



శివ్వంపేట(నర్సాపూర్): లక్ష్మీనర్సింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కనుల పండువగా కొనసాగుతోంది. అందులో భాగంగా ఆదివారం మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కొనేరులో స్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కొండపైన కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని కాలినడకన వెళ్లి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని వంటవార్పు చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ నర్సింహరెడ్డి, అర్చకుడు విద్యాకర్‌చారి తదితరులు ఉన్నారు.

సీఐటీయూ ముగింపు సభను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నర్సాపూర్: సీఐటీయూ ముగింపు సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. ఆదివారం సీఐటీయూ నాయకులతో కలిసి చలో ఇందిరా పార్కు వాల్‌పోస్టర్‌ను పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో చేపట్టిన పాదయాత్ర ఈనెల 28న ఇందిరాపార్కుకు చేరుకుంటుందని చెప్పారు. 28న ఇందిరా పార్కు వద్ద జరిగే ముగింపు సభను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. గ్రామ పంచాయితీలలో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేశ్, చంద్రయ్య, పోచయ్య, రమేశ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచ్ జ్యోతి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచ్ జ్యోతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, ఉపసర్పంచ్ లక్ష్మీపతి, మాజీ సర్పంచ్ ఆవుల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు బాగారెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బందెల ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేష్ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పొసి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించడంతో పాటు వాహనాలకు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మంచినీరు, వసతితోపాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఇతర సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకుడు ప్రభాకరశర్మ తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశామన్నారు.

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారవేత్త కల్లేటి శ్రీధర్ గుప్తా నిర్మించిన గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన దామోదరను శ్రీధర్ గుప్తా దంపతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రేగోడ్, అల్లాదుర్గం కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎస్.దిగంబర్ రావు, శేషారెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు చోటుబాయ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి, డైరెక్టర్ నాగేందర్‌రావు కులకర్ణి, పాఠశాల కమిటీ చైర్మన్ భస్వరాజ్, మాజీ ఎంపీటీసీ గాండ్ల నర్సింలు, నాయకులు వెంకట్‌రెడ్డి, శంకరప్ప, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రేగోడ్(మెదక్): ఆలయంలో ..

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న ఎమ్మెల్యే

రామాయంపేట(మెదక్): నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నార్సింగి మండలం సంకాపూర్ సిక్కు తండాలో జరిగిన శ్రీ గురుహర్‌రాయి సాహెబ్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో ఆమె హాజరై.. మాట్లాడుతూ... ఇప్పటికే తండా అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. ఆలయం అభివృద్ధికి కూడా తనవంతు సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యే శంకాపూర్ గ్రామంలో సర్పంచ్ సూజాత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముదిరాజ్ భవనం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె నిధుల మంజూరుకు సంబంధించి ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు బాబు, పట్లోరి రాజు, మండల ఉపాధ్యక్షురాలు సుజాత, ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు మల్లేశం గౌడ్, యోగి, తౌర్యానాయక్, రాజేందర్‌రెడ్డి, యాదగిరి, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు భేష్

వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు



డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న మంత్రి

మెదక్‌జోన్: మెదక్ ఎంసీహెచ్‌లో వైద్యసేవలు చాలా బాగున్నాయని వైద్యరోగ్య, ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మెదక్‌కు వచ్చిన సందర్భంగా ఎంసీహెచ్‌లో క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన సమావేశంలో మాట్లాడుతూ.. వైద్యం చాలా బాగుందని, ఇదే తరహాలో పేదలకు వైద్యం అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ గైనకాలజిస్టు శివదయాళ్‌ను మంత్రి ఘనంగా సన్మానించారు.

శ్రీకృష్ణానంద మహరాజ్‌ను కలిసిన ఎమ్మెల్యే



కృష్ణానందస్వామితో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిప్పల్‌తుర్తిలో శ్రీకృష్ణానంద మహరాజ్‌ను ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు. చిప్పల్‌తుర్తిలోని సద్గురు ఆశ్రమంలో మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో హిమాలయాలకు చెందిన సిద్ధయోగి శ్రీకృష్ణానంద రావడంతో ఎమ్మెల్యే ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిప్పల్‌తుర్తి గ్రామంలో ఆశ్రమం ఏర్పాటు చేయడం సంతోషకరమని తెలిపారు. కబీర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు చత్రునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు చాలా బాగున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల లక్ష్మణ్‌గౌడ్, ఎంపీటీసీ సంధ్యారాణి, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి, పైడి శ్రీధర్‌గుప్తా, శివకుమార్, మన్సూర్ పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప జాతర ప్రారంభం



బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని ఏటిగడ్డ మందాపూర్‌లో ఆదివారం బీరప్ప జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని ఆలయంలోని మూలవిరాట్టుకు శివారులోని మంజీరా నదిలోని నీటితో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి సన్నిధిలో గణపతి పూజ, గ్రామస్తుల ఆధ్వర్యంలో బోనాలు ఊరేగించి, మొక్కులు తీర్చుకున్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు

'ప్రభుత్వ భూమిని కాపాడాలి'

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని తునికి గేట్ వద్ద గల 245 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని హరిచంద్‌తండా పంచాయతీ దేవులతండా గిరిజనులు ఆదివారం సాయంత్రం ఆందోళన చేశారు. తండాకు చెందిన సురేశ్, రమేశ్, రవీందర్, మదన్‌లాల్, శ్రీనివాస్, బిక్య తదితరులు మాట్లాడుతూ.. 245 సర్వేనంబర్‌లో ప్రభుత్వ భూమి ఉండగా, క్రొందరు నాయకులు అక్రమంతో వేరే సర్వేనంబర్లతో కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూమి 765డీ జాతీయ రహదారి పక్కన ఉండటంతో రూ.కోట్ల విలువైన భూమిని కబ్జాలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాల, డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు స్పందించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

బీఆర్‌ఎస్ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం నుంచి మెదక్ వరకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం మెదక్‌లో రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ నాయకులు చిన్నశంకరంపేట నుంచి బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు, హేమ చంద్రం, సుధాకర్‌నాయక్, రాధాకిషన్, ఇమ్మడి నరేష్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

చేగుంట(తూప్రాన్): సేంద్రియ వ్యవసాయంపై నిరంతర ప్రచారం నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా సేవా ప్రముఖ్ ప్రభాకర్ అన్నారు. ఆదివారం చేగుంటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం ఎక్కువైనందున భవిష్యత్‌లో ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని తనవంతుగా సేంద్రియ వ్యవసాయంపై గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మొదటిదశ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా చేగుంట మండలాన్ని ఎంచుకున్నట్లు చెప్పారు. మండలం యూనిట్‌గా నిర్వహించే ప్రచారంలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై నిష్ణాతులతో కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. వీహెచ్‌పీ మండల ప్రముఖ్ సురేష్, పట్టణ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మోడల్‌స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని మోడల్‌స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం దరఖాస్తు గడువును వచ్చే నెల మార్చి 1 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఓసీ విద్యార్థులు రూ.200, పీహెచ్‌సీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125లు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.